
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



సోమశిలలో 62.907 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 62.907 టీఎంసీలు ఉన్నాయి. దిగువ కాలువలకు 3,850 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,550
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,890
3 శాతం జీఎస్టీతో	రూ.8,127
నవర (8 గ్రా)	రూ.65,016

గరిష్టం/కనిష్టం 34.0 /23.0

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. ఆదివారం గాలిలో తేమ 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పూలే దంపతుల విగ్రహావిష్కరణ



పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరించిన హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

నెల్లూరు (టౌన్): నగరంలోని పప్పులవీధిలో ఉన్న వీఏఎం నగరపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో బండారు ఈశ్వరమ్మ పొదుపు గ్రూపు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను ఆదివారం హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి పొంగూరు నారాయణ ఆవిష్కరించారు. గవర్నర్ దత్తాత్రేయను మంత్రి నారాయణ ఘనంగా సత్కరించారు. గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వారి ఆదర్శాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆర్డీఓ అనూష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మనీ స్కాం నిర్వాహకులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

కావలి: పట్టణంలోని ముసునూరులో అనంతార్థ అసోసియేట్స్ ఏర్పాటు చేసిస్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసానికి పాల్పడిన నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కావలిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) నాయకులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, కె నాగరాజు, దమ్ము దర్గాబాబు, పసుపులేటి పెంచలయ్య, లక్ష్మీరెడ్డి, కరవది భాస్కర్, మల్లి అంకయ్య, చిట్టిబాబు, చేవూరి కొండయ్య తదితరులు మాట్లాడారు. నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని, మనీ స్కాంలో నష్టపోయిన బాధితులకు వామపక్ష పార్టీలు అండగా ఉంటాయని ప్రకటించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. మనీ స్కాంలో ఏజెంట్లుగా ఉండి, అండగా నిలిచిన ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024 ఆగస్టులోనే మనీ స్కాంపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ పోలీసులు దృష్టి సారించలేదన్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ తరహా నేరాలకు పాల్పడిన వ్యక్తికి కావలిలో పోలీసు అధికారులు కొమ్ము కాయడం అత్యంత విచారకరమన్నారు.

ఆజాద్ సెంటర్‌లో పోలీసు పికెట్



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరం ఆజాద్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటు చేయడంతో రెండు వర్గాల నడుమ వివాదానికి దారి తీసింది. అక్కడ ఆ రెండు వర్గాలు మోహరించడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న నగర డీఎస్పీ పి.సింధుప్రియ నేతృత్వంలో పోలీసులు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెండు వర్గాలను చెదరగొట్టారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆజాద్‌సెంటర్ వైపు వెళ్లే అన్నీ రహదారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిషేధించారు. దుకాణాలన్ని మూయించివేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతం ఆదివారం నిర్మానుష్యంగా మారింది.

ఛీ.. ఇంత నీచమా


డబ్బు సంపాదించడానికి ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ కోవూరు నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్న కొందరు నేతలు నీచ స్థితికి దిగజారిపోయారు. ఇప్పటికే సహజ వనరులతోపాటు పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని దోచుకుంటూ జేబులు నింపుకుంటున్న వీరు పర్యావరణాన్ని కలుషితం చేస్తూ చేపలకు చికెన్ వేస్ట్ సరఫరా చేస్తున్నారు. తాజాగా పశువులను కబేళాలకు పంపిస్తూ కమీషన్లు దండుకునే నీచ స్థాయికి దిగజారిపోయారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానం లేకుండానే ఆగమేఘాల మీద పంచాయతీ కార్యదర్శి అనుమతలు మంజూరు చేయడం చూస్తే ఏ స్థాయిలో సొమ్ములు చేతులు మారాయో అర్థమవుతోంది.

పశువులను కబేళాలకు తరలిస్తూ రూ.లక్షల్లో సంపాదన

- పంచాయతీ పాలకవర్గ తీర్మానం లేకుండానే సంత నిర్వహణకు అనుమతి
- కోవూరు, పడుగుపాడు, రేగడిచెలికల్లో పశువుల సంతల నిర్వహణ
- రూ.లక్షల్లో చేతులు మారడంతో సంతలకు అనుమతి
- కోవూరులో బరితెగించిన షాడో ఎమ్మెల్యేలు




కోవూరులో ఏర్పాటు చేసిన సంతలో కట్టేసిన పశువులు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కోవూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు పశువుల రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్నారు. పాడి పశువులను కబేళాలకు తరలించేందుకు ఏకంగా మూడు చోట్ల సంతలను ఏర్పాటు చేసి కమీషన్లతో జేబులు నింపుకుంటున్నారు. వారానికి రెండు రోజుల పాటు నిర్వహిస్తూ మూగజీవాల ఉసురుపోసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో గతంలో నెల్లూరు పెన్నావంతెన, చిల్లకూరు ప్రాంతాల్లో ఉండే పశువుల సంతల నిర్వాహకులు పశువులను కబేళాలకు పంపించడం మహాపాపమని భావించి ఎత్తేయడంతో ఆ వ్యాపారాన్ని కోవూరు టీడీపీ నేతలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో ప్రస్తుతం కోవూరు నియోజకవర్గంలో మూడు చోట్ల సంతలను ఏర్పాటు చేసి పశువుల అక్రమ రవాణాను ప్రోత్సహిస్తుండడంపై ఆ పార్టీ శ్రేణులే ఛీదరించుకుంటున్నాయి.

పంచాయతీ పాలకవర్గం అనుమతి లేకుండానే కార్యదర్శి ఉత్తర్వులు

కోవూరు పంచాయతీలో సంత నిర్వహించేందుకు ఆగమేఘాల మీద పంచాయతీ కార్యదర్శి ఉత్తర్వులిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ సంత నిర్వహణకు ఈ ఏడాది జనవరి 6వ తేదీ దరఖాస్తు చేసుకుంటే అదే రోజు పంచాయతీ తీర్మానం చేసినట్లు, ఫిబ్రవరి 3వ తేదీ సిఫార్సు, ఫిబ్రవరి 4వ తేదీ ఈఓపీఆర్డీ, అదే రోజు డివిజనల్ పంచాయతీ అధికారి అంగీకారం మేరకు ఫిబ్రవరి 5వ తేదీన కోవూరు పంచాయతీ కార్యదర్శి సంత నిర్వహణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రక్రియను పరిశీలిస్తే దరఖాస్తు చేసిన రోజునే పంచాయతీ తీర్మానం చేయడం, మూడు రోజుల్లో పంచాయతీ కార్యదర్శి నుంచి డివిజనల్ పంచాయతీ అధికారి వరకు ఆగమేఘాల మీద అనుమతుల్వివడం చూస్తుంటే ఏ స్థాయిలో ముడుపులు చేతులు మారాయో అర్థమవుతోంది. వేరెవరైనా అనుమతులకు దరఖాస్తు చేసుకుంటే.. ఇంత వేగంగా ప్రభుత్వ శాఖలు అనుమతి ఇస్తాయా? ఇచ్చినా దాఖలు ఉన్నాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలాఉంటే కోవూరులో సంత నిర్వహణకు పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండానే ఈ ప్రక్రియ అంతా పంచాయతీ కార్యదర్శి నడిపించినట్లు విమర్శలు ఉన్నాయి. బోగస్ పంచాయతీ తీర్మానంతో ఆగమేఘాల మీద సంత నిర్వహణ ఏడాది పాటు చేసుకునేందుకు ఏకంగా నిబంధనలు ఉల్లంఘించి రాత్రికి రాత్రే ఉత్తర్వులు ఇవ్వడం పెద్ద దుమారం రేపింది. అయితే పాలకవర్గం ఉన్నప్పటికి వారి అనుమతి లేకుండానే కోవూరు పంచాయతీ కార్యదర్శి మండల స్థాయి నేతకు నిర్వహణ ఉత్తర్వులు ఎలా ఇస్తారంటూ పాలకవర్గం నిలదీసింది. తమపై వస్తున్న రాజకీయ ఒత్తిళ్ల క్రమంలోనే ఉత్తర్వులు ఇచ్చేశానని కార్యదర్శి బహిరంగంగానే చెబుతుండడం గమనార్హం.



కార్యదర్శి ఇచ్చిన అనుమతి ఉత్తర్వులు

మూడు చోట్ల సంతలు.. చేతులు మారిన రూ.లక్షలు

కోవూరు, పడుగుపాడు పంచాయతీలతోపాటు కొడవలూరు మండలంలోని రేగడిచెలికలో పశువుల సంతలను ఏర్పాటు చేశారు. ఇందులో కోవూరు పంచాయతీలో సంత నిర్వహణకు అనుమతులు తీసుకుంటే.. పడుగుపాడు, రేగడిచెలిక సంతలకు కనీసం అనుమతులు కూడా లేవని తెలుస్తోంది. ప్రతి మంగళ, శుక్రవారాల్లో సంత నిర్వహణను ఏర్పాటు చేసేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందు కోసం రూ.లక్షల్లో చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క సంత నుంచి వారంలో రెండు రోజుల్లో కనీసం 100 నుంచి 150 లారీల్లో పశువుల అక్రమ రవాణా జరుగుతోంది. తద్వారా నెలకు రూ.లక్షల్లో కమీషన్లు వస్తున్నట్లు సమాచారం.

రవాణాకు పశుసంవర్ధక శాఖ అనుమతుల్లేకుండానే..

పశువులను కబేళాలకు తరలించేందుకు పశుసంవర్ధక శాఖ వైద్యుల అనుమతి ముఖ్యం. ఒట్టిపోయిన పశువులనే కబేళాలకు తరలించాల్సి ఉంది. జబ్బున పడ్డ పశువులను ఏమాత్రం కబేళాలకు తరలించకూడదు. ఇలాంటి నిబంధనల నేపథ్యంలో పశు వైద్యులు సర్టిఫై చేసిన పశువులనే కబేళాలకు తరలించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా రెండు.. మూడేళ్ల దూడల నుంచి పాలిచ్చే పశువుల వరకు ఈ సంతల నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ సంతల నుంచి అపహరించిన పశువులను రవాణా చేస్తున్నారు. డబ్బు సంపాదించేదుకు అనేక మార్గాలు ఉన్నప్పటికీ పశువుల ఉసురుతో డబ్బు సంపాదించేందుకు ప్రభుత్వ శాఖల అధికారులతోపాటు అధికార పార్టీ నేతలు దిగజారిపోవడం పశు పోషకులతోపాటు మానవతావాదులను బాధిస్తోంది.

హిందుత్వ వాదులూ.. ఏమయ్యారో!

గోవధను నిషేధించాలంటూ ఉద్యమాలు చేసే హిందుత్వ సంఘాలు కోవూరు నియోజకవర్గం నుంచి పశువులను కబేళాలకు అధికార పార్టీ నేతలు అక్రమంగా తరలిస్తుంటే ఏం చేస్తున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిత్యం దైవసేవలో ఉండే స్థానిక ప్రజాప్రతినిధి సైతం తన షాడో ఎమ్మెల్యేలు చేస్తున్న ఈ దురాగతాన్ని అడ్డుకోకపోవడాన్ని కూడా హిందువులు నిలదీస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం పట్టీపట్టనట్లు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూటమికి కొమ్ముకాస్తే కష్టాలే!



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- అధికార పార్టీ నేతల మౌఖిక ఆదేశాలు పాటిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పవు
- న్యాయమే గెలిచిందనేందుకు పేచీరాజ్‌కు బెయిల్ మంజూరే నిదర్శనం
- నగరవనం ప్రారంభోత్సవ శిలాఫలకంలో తిరుపతి ఎంపీ పేరు లేకపోవడం సరికాదు
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు)/వెంకటగిరి (సైదాపురం): ప్రజా సేవే లక్ష్యంగా అధికారులు పని చేయాలని, కూటమి నేతలకు కొమ్ముకాస్తూ.. వారిచ్చే మౌఖిక ఆదేశాలను పాటిస్తే భవిష్యత్‌లో కష్టాలు తప్పవని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌జేఆర్ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ పేదలకు న్యాయం చేయాలని, ఇబ్బంది పెట్టేలా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తమ పార్టీ కార్యకర్త పేచీరాజ్‌పై గతేడాది డిసెంబర్ 21న అక్రమంగా గంజాయి కేసు బనాయించి జైలుపాలు చేశారని ఆరోపించారు. అయితే పేచీరాజ్ కేసును విచారించిన హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీ సమర్పించాలని పోలీసులను ఆదేశించిందని గుర్తుచేశారు. ఈ క్రమంలో అక్రమ కేసు నమోదు చేసిన పోలీసులు భవిష్యత్‌తో హైకోర్టుకు సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటగిరి సుందరీకరణకు 110 ఎకరాల్లో నగర వనం ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశామని, ప్రస్తుతం ఆ పనులు ఎక్కడి వరకు వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నగరవనం ప్రారంభోత్సవంలో శిలాఫలకం విషయంలో ప్రోటోకాల్ పాటించలేదని, దళితుడైన తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తిని అవమానించేలా ఆయన పేరు లేకుండా చేశారని మండి పడ్డారు. ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైన డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న పవన్ కల్యాణ్ పేరు కూడా శిలాఫలకంలో లేదన్నారు. దీనిపై స్థానిక జనసేన నేతలు స్పందించాలని సూచించారు. అధికార పార్టీ నేతల ప్రాపకం కోసం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. 2027లో జమిలి ఎన్నికలు రాబోతున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం తథ్యమని స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో అధికారులు నిబంధనల అమల్లో సాంకేతిక కారణాలను సాకుగా చూపి సరైన విధానాన్ని పాటించలేదన్నారు. మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో చైర్ పర్సన్, చైర్మన్ల మార్పు జరుగుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో వెంకటగిరిలో అలాంటి ప్రయత్నం జరిగితే దానిని ఎలా తిప్పి కొట్టాలో తనకు సంపూర్ణ అవగాహన ఉందని, అధికారులు నిబంధనలు విధిగా పాటించాలని నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, బాలాయపల్లి, డక్కిలి మండలాల కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, కౌన్సిలర్లు ఆటంబాకం శ్రీనివాసులు, సుబ్బారావు, వహిదా, నేతలు అల్లంసాయి, పేచీరాజ్, దశరథరామిరెడ్డి, సతీష్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అతిగా ప్రవర్తించే వారి లెక్కలు తేలుస్తాం



ముత్యాలపేటలో నాయకులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమని, కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అతిగా ప్రవర్తించే వారి లెక్కలు తేలుస్తామని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిరదవోలులో శనివారం రాత్రి కాకాణి పర్యటించారు. ఆయన్ను పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. అక్రమ కేసులు పెట్టి తమ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారి లెక్కలు రాసుకుంటామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు నడవాలని సూచించారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముత్యాలపేట గ్రామ నాయకుడు కండే రమణయ్య సోదరుడు కండే వెంకటేశ్వర్లు కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. కాకాణి వెంట బిరదవోలు ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, నాయకులు వెన్నపూస దయాకర్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకటశేషయ్య, వెన్నపూస యానాదిరెడ్డి, మాలపాటి రమణారెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి ఉన్నారు.

రోడ్లపై సాగునీరు

సాగునీటి కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల సాఫీగా సాగాల్సిన సాగునీరు రోడ్లపై ప్రవహరించి రోడ్లు దెబ్బతింటున్నాయని కాకాణి ఆవేదన వ్యక్తం చేశారు. సోమిరెడ్డి ధన దాహానికి సాగునీటి కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల కాలువలు పొంగుతున్నాయని విమర్శించారు. కాలువ నీరు ఉబికి రోడ్లపైకి రావడమే కాక పొలాల్లోకి వెళ్లడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పొదలకూరు మండలం నందివాయ–అమ్మవారిపాళెం గ్రామాల మధ్య సాగునీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదన్నారు. పరిస్థితిని గమనించిన స్థానిక రైతులు సొంత నిధులతో నీరు రోడ్లపైకి రాకుండా కట్టలు పోసుకుంటున్నారన్నారు.

పరిహారంలో దగా

విజయవాడ–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి చేపట్టిన భూసేకరణ పరిహారంపై సీతారామపురం మండల రైతులకు కూటమి సర్కార్ తీవ్ర అన్యాయం చేస్తోంది. నామమాత్రపు పరిహారం చెల్లించి బలవంతంగా భూములు లాక్కొంటున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. మా కడుపులు కొట్టొదంటూ రైతులు అధికారులు, కాంట్రాక్టర్లను వేడుకున్నా కనికరించడంలేదు. పచ్చని పైర్లను యంత్రాలతో ధ్వంసం చేసి రోడ్డు పనులు చేపడుతున్నారు.

- నామమాత్రపు ధరలతో రైతుల భూముల సేకరణ
- బలవంతంగా లాక్కొంటున్న అధికారులు



పొలాల్లో నిర్మిస్తున్న రోడ్డు



పొలం చుట్టూ ఉన్న గోడ కూల్చివేత

ఉదయగిరి: సీతారామపురం మండల పరిధిలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం.. రైతుల పాలిట శాపంగా మారింది. విలువైన భూములను రోడ్డు నిర్మాణానికి సేకరిస్తున్న క్రమంలో రైతుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సముచిత పరిహారం చెల్లించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అరకొరగా పరిహారం ఇస్తామంటూ బెదిరించి మరీ స్వాధీనం చేసుకుంటోంది. ఆయా గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు ఇచ్చే పరిహారంపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే అప్పటి అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కడుపుకొట్టి పచ్చని పంట సాగులో ఉన్న భూములను దౌర్జన్య పూరితంగా స్వాధీనం చేసుకుంటుంది. కనీసం పంట కాలం పూర్తయ్యాక అయినా.. తీసుకుని ప్రాధేయపడుతున్నా.. అధికారులు కనికరించడం లేదు.

పరిహారంలో అన్యాయం

మండలంలో మారుమూల గ్రామాల్లో కూడా ప్రస్తుతం ఎకరా ధర రూ.8 లక్షలు వరకు పలుకుతోంది. కొన్ని చోట్ల అయితే రూ.15 లక్షలు వరకు కూడా ఉంది. అయితే రైతులకు మాత్రం రూ.4 లక్షలు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నారు. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పైగా పరిహారం చెల్లింపుల్లో కూడా సమన్యాయం పాటించలేదని, అధికార పార్టీ నేతల మద్దతు ఉన్న వారికి అధికంగా చెల్లింపులు జరిగాయని పలువురు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం రూ.6 లక్షలు అయినా ఇవ్వాలని రైతులు కోరుతున్నా.. పట్టించుకోవడంలేదు.

బలవంతంగా భూములు స్వాధీనం

మండలంలోని మారంరెడ్డిపల్లి, గంధంవారి పల్లి, పబ్బులేటిపల్లి, ఓగూరువారిపల్లి గ్రామాల్లో భూములు సేకరించారు. అయితే పబ్బులేటిపల్లికి చెందిన కొంత మంది రైతులు న్యాయమైన పరిహారం ఇచ్చేంత వరకు తమ భూముల్లో పనులు చేయనీయమని గట్టిగా చెప్పారు. అయితే గత నెల 23న పోలీసులను అడ్డంపెట్టుకుని పంటలు ధ్వంసం చేసి పనులు చేపట్టారు. పొలం చుట్టు రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్న గోడకు పైసా పరిహారం ఇవ్వకుండా కూల్చేశారు. ఏళ్ల తరబడి పెంచుకున్న టేకుచెట్లకు కూడా పరిహారం ఇవ్వకుండా తొలిగించడంపై రైతులు లబోదిబోమంటున్నారు.

ఎకరాకు రూ.7 లక్షలు పరిహారం ఇవ్వాలి



ఎక్స్‌ప్రెస్ రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన భూములకు పరిహారం చెల్లింపులో ప్రభుత్వం మాకు తీవ్ర అన్యాయం చేసింది. ఇక్కడ భూములు ఎకరా రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకు ఉంది. మాకు న్యాయంగా కనీసం రూ.7 లక్షలు అయినా పరిహారంగా ఇవ్వాలి అని అడిగాం. అప్పుడు అధికారులు సరే అని తీరా ఇప్పుడు రూ.4 లక్షలు మాత్రమే ఇచ్చి బలవంతంగా భూములు లాక్కున్నారు.

– పల్లె రామచంద్రయ్య, పబ్బులేటిపల్లి

ప్రభుత్వ ధర మేరకే పరిహారం



ప్రభుత్వ నిబంధన మేరకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నగదు వారి ఖాతాల్లో జమ చేశాం. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కానీ ఇవ్వలేం. ఈ విషయంపై అధికారులు దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రజావసరాల నిమిత్తం భూసేకరణ బలవంతంగా నైనా చేయాలి. రైతులు అర్థం చేసుకుని అభివృద్ధి పనులకు సహకరించాలి.

– కృష్ణారెడ్డి, తహసీల్దార్

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

- ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పొదలకూరు: ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన పట్టణానికి సమీపంలోని రాపూరు మార్గంలో చైతన్య స్కూల్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మర్రిపాడు మండలం పల్లవోలుకు చెందిన ముగ్గురు యువకులు సైదాపురం మండలం కలిచేడుకు వెళ్లారు. తిరిగొస్తుండగా, పొదలకూరు నుంచి రాపూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. ఘటనలో ఇండ్ల పుల్లయ్య, రాగి వెంకయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో చోరీపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో ఆటో చోరీపై పోలీసులకు బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేశారు. వెంకటాచలానికి చెందిన మేకల గోవింద్, కుటుంబసభ్యులతో కలిసి గొలగమూడిలోని భగవాన్ వెంకయ్య స్వామి ఆశ్రమానికి తన ఆటోలో శనివారం వెళ్లారు. ఆశ్రమం వద్ద పార్కింగ్ స్టాండ్‌లో ఆటోను నిలిపారు. అనంతరం వచ్చేసరికి కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా శ్రీధర్



నెల్లూరు సిటీ: పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ జనరల్ సెక్రటరీగా ముషీధర్, ఉపాధ్యక్షులుగా పద్మజ, కోశాధికారిగా దుర్గా దొరబాబు ఎన్నికయ్యారు. సమస్యలపై రాష్ట్ర కార్యవర్గానికి తెలియజేసి పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సుమన్

నెల్లూరు(అర్బన్): అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరానికి ఆదివారం వచ్చిన వీరు.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కలిసి ఉద్యోగ భద్రత కోసం చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘ కార్యవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆప్కాస్ విధానాన్ని నేటి ప్రభుత్వ పెద్దలు రద్దు చేస్తామని ప్రకటించడాన్ని తప్పుపట్టారు. ఇలా అయితే మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీకి చిరుద్యోగులు బలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సొసైటీల కింద పనిచేస్తున్న మెప్మా, సెర్ప్ సిబ్బందికి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించారని గుర్తుచేశారు. ఆప్కాస్‌పై ఏర్పడిన అనిశ్చితిని తొలగించాలని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మహిధర్ బాబు, జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజేష్, రాష్ట్ర కోశాధికారి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

చిల్లకూరు: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ పోటీలకు 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును ఎంపిక చేశామని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, గురుకుల పాఠశాల పీడీ శ్రీరేష్ తెలిపారు. చిల్లకూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూల్లోని క్రీడా మైదానంలో ఈ నెల 21 నుంచి 23 వరకు పోటీలను నిర్వహించనున్నారని చెప్పారు. పీడీ హేమంత్, పీఈటీ అఖిల్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు



పెద్దవి	:రూ.40
సన్నవి	:రూ.25
పండ్లు	:రూ.18

సర్కార్ నిర్లక్ష్యం.. పౌల్ట్రీకి శాపం

బర్డ్ ఫ్లూపై చర్యలు శూన్యం

- నష్టపోతున్న నిర్వాహకులు
- ఆర్నెల్ల క్రితమే గుర్తించినా ముందస్తు చర్యలేవీ..?
- అంతా అయ్యాక టీకాల పేరిట హడావుడి



కోళ్ల ఫారంలో తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్): బర్డ్ ఫ్లూ కేసులు జిల్లాలో ఆర్నెల్ల క్రితమే నమోదైనా, సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పెద్దగా నష్టం ఉండదంటూ పశు సంవర్ధక శాఖ అధికారులూ నిర్లిప్త ధోరణిని కనబర్చారు. ఫలితంగా ఈ వైరస్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విజృంభిస్తూ పౌల్ట్రీ రంగాన్ని కకావికలం చేస్తోంది.

నష్టపోతున్న నిర్వాహకులు

జిల్లాకు ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటారు. జిల్లాలో పౌల్ట్రీ రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కోళ్ల ఫారాలను కొందరు నిర్వహిస్తున్నారు. 19 ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాలుండగా, ప్రస్తుత ఇబ్బందుల తరుణంలో అది పదికే పరిమితమైంది. ఇందులో దాదాపు మూడు లక్షల కోళ్లను పెంచుతున్నారని సమాచారం. చిన్నచితకా చికెన్ వ్యాపారులు వారి షాపుల వద్దే కోళ్లను పెంచుకుంటున్నారు. వీటిలో ఒక్క దానికి వ్యాధి వచ్చినా, మిగిలినవి మృత్యువాతపడే అవకాశాలున్నాయి. అధికారులు మాత్రం ఈ విషయాన్ని బయటకు రానివ్వడంలేదు. ఎక్కడ తమ నిర్లక్ష్యం బయటపడుతుందోననే భయంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో స్పందించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. మీరే జాగ్రత్తలు పాటించాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామంటూ పౌల్ట్రీ నిర్వాహకులను కొందరు అధికారులు హెచ్చరించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

అంతులేని నిర్లక్ష్యం

జిల్లాలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు కోళ్లకు వచ్చాయనే అంశం ఆర్నెల్ల క్రితమే బయటపడింది. గుమ్మళ్లదిబ్బ, చాటగొట్ల ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. వ్యాధి కారణంగా అప్పట్లో దాదాపు పది వేల కోళ్లకుపైగా చనిపోయాయి. అప్పట్లో ఈ వ్యవహారం జిల్లాలో సంచలనంగా మారింది. కేంద్రం నుంచి నెల్లూరొచ్చిన ప్రత్యేక బృందం అధ్యయనం చేసి బర్డ్‌ఫ్లూ అని నిర్ధారించింది. కొన్ని రోజుల పాటు ఈ ప్రాంతాల్లో పది కిలోమీటర్ల మేర ప్రత్యేక జోన్‌ను ప్రకటించారు.

ఇప్పుడు హడావుడి..

బర్డ్ ఫ్లూ అనేది హెచ్5ఎన్1 అనే వైరస్ ద్వారా వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెప్తున్నారు. ఈ వ్యాధి ఒక కోడి నుంచి మరోదానికి వ్యాపించి మృత్యువాత పడే అవకాశాలున్నాయి. తాజాగా ఉభయగోదావరి జిల్లాల్లో వెలుగులోకి రావడంతో టీకాలంటూ జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. పౌల్ట్రీ నిర్వాహకుల వద్దకెళ్లి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కోళ్లను అనుమతించొద్దని, ఫారాల్లోకి కొత్త వ్యక్తులను రానీయొద్దంటూ సూచనలు జారీ చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని అధికారులు చెప్తున్నారు. వీటిపై మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆందోళన వద్దు

జిల్లాలోని రెండు ప్రాంతాల్లో కొద్ది నెలల క్రితం వ్యాధి వచ్చిన మాట వాస్తవమే. ప్రస్తుతం జిల్లాలో బర్డ్ ఫ్లూ ఎక్కడా లేదు. వ్యాధి ప్రబలకుండా ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయి. ఎలాంటి ఆందోళన అక్కర్లేదు.

– చైతన్యకిశోర్, ఏడీ, జిల్లా పశువైద్య నిర్ధారణ ప్రయోగశాల

ఎక్కడా ఇబ్బందుల్లేవు

జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ ఇబ్బందుల్లేవు. ఉభయగోదావరి జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉందని తెలిసింది. ఇక్కడ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భయపడాల్సిన అవసరం లేదు.

– వెంకటరమణయ్య, బ్రాయిలర్ ఫార్మర్స్ అసోసియేషన్

మలివయసులో ఆదరణ కరువై..

- మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

సీతారామపురం: వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పడమటి రొంపిదొడ్లలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ముటుకుందు చెన్నమ్మ (75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబసభ్యుల ఆదరణ కరువవడంతో జీవితంపై విరక్తి చెంది ఊరి బయటకెళ్లి పురుగుల మందు సేవించి పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. 108లో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే చెన్నమ్మ మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జోయాలుక్కాస్‌లో 50 శాతం ఆఫర్లు



బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): అన్నమయ్య సర్కిల్ సమీపంలోని జోయాలుక్కాస్ జ్యువెలరీ షోరూమ్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసిన అనంతరం 50 శాతం ఆఫర్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ అక్రమ్ అహ్మద్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ మాట్లాడారు. మాఘమాసం, పెళ్లిళ్ల సీజన్‌ను పురస్కరించుకొని గోల్డ్, డైమండ్ జ్యువెలరీ, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినమ్, సిల్వర్ ఆభరణాలపై మజూరీ చార్జీల్లో 50 శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశం మార్చి ఏడు వరకే అందుబాటులో ఉంటుందని వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	105
లేయర్ (లైవ్)	80
బ్రాయిలర్ చికెన్	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	216
లేయర్ చికెన్	136

ముందస్తు సర్జరీలతో మెనోపాజ్



మాట్లాడుతున్న అంజూసోనీ

నెల్లూరు(అర్బన్): చిన్న వయస్సులోనే ఆపరేషన్లు చేసి గర్భ సంచులను తొలగించడం ద్వారా మహిళలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఢిల్లీకి చెందిన ఇండియన్ మెనోపాజ్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అంజూసోనీ పేర్కొన్నారు. మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నూతనంగా ఏర్పడిన నెల్లూరు మెనోపాజల్ సొసైటీని నగరంలోని ఓ హోటల్లో ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. చిన్న అనారోగ్య కారణాలతో 30 ఏళ్లకే గర్భసంచిని తొలగించడం దారుణమని, దీంతో ముందస్తుగా మెనోపాజ్‌కు మహిళలు గురవుతున్నారని చెప్పారు. అనంతరం పలు రకాల కేన్సర్ వ్యాధులు, నివారణ తదితరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. మెడికవర్ సెంటర్ హెడ్ బిందురెడ్డి, డాక్టర్లు రమేష్‌బాబు, రంగరామన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లాలోని 100కుపైగా మహిళా డాక్టర్లు సభ్యులుగా నెల్లూరు మెనోపాజల్ సొసైటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా పల్లంరెడ్డి యశోధర, కార్యదర్శిగా ఉషారాణి, నెల్లూరు అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సుప్రజ, లలితషిర్డీశాను ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వింజమూరు(ఉదయగిరి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బుక్కాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కృష్ణ (48) తనకున్న నాలుగెకరాల వ్యవసాయ భూమిలో పైరుకు నీరు పెట్టేందుకు ఉదయం 6.30 గంటల సమయంలో వెళ్లారు. ఆ సమయంలో మోటార్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ హెడ్ ఫ్యూజ్ కాలిపోవడాన్ని గమనించారు. దాన్ని సరిచేసే నిమిత్తం స్తంభమెక్కి విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయారు. ఎంతకీ రాకపోవడంతో భార్య ఫోన్ చేసినా ప్రయోజనం లభించలేదు. దీంతో పొలం వద్దకు కుటుంబసభ్యులు హుటాహుటిన వెళ్లగా నేలపై పడి ఉన్నారు. ఆయన్ను లేపి మాట్లాడగా, షాక్‌కు గురయ్యానని చెప్పడంతో ఆటోలో వింజమూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద దిక్కు మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరొకరికి గాయాలు



ఘటన స్థలాన్ని మనుబోలు ఎస్సై శివరాకేష్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనుబోలు: ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలోని కాఫీ డే వద్ద లారీ యాక్సిల్ విరిగిపోవడంతో రోడ్డుపై నిలిచిపోయింది. ఇదే సమయంలో ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన మద్దిపట్ల రాజేష్ నాయుడు (34), తన స్నేహితుడు శేఖర్ కలిసి బైక్‌పై సొంతూరు వెళ్లసాగారు. ఈ క్రమంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న రాజేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, శేఖర్ గాయపడ్డారు.

దేశ సంపదను దోచేయడమే లక్ష్యంగా నిర్ణయాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశ సంపద, వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడమే లక్ష్యంగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు – సవాళ్లు అనే అంశంపై నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఈ విధానాలను వీడకపోతే వికసిత్ భారత్ కాస్త చీకటి భారత్‌గా మారే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం, విద్య, వైద్యం, ఆహార సబ్సిడీ, వ్యవసాయం తదితరాలకు బడ్జెట్లో కోత విధించారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నేతలు కత్తి శ్రీనివాసులు, రాంబాబు, నరసింహులు, మాలకొండయ్య, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు అడ్డంగా గోడ..!

- పరిహారం చెల్లించలేదంటూ వ్యక్తి వినూత్న నిరసన



ఆత్మకూరు: పట్టణ పరిధిలోని రెండో వార్డులో గల నరసాపురంలో తన స్థలంలో సిమెంట్ రోడ్డును నిర్మించి, దానికి సంబంధించిన నష్టపరిహారాన్ని చెల్లించలేదంటూ రోడ్డుపై అడ్డంగా గోడను ఓ వ్యక్తి నిర్మించారు. నరసాపురానికి చెందిన అల్లంపాటి మాధవరెడ్డి వలంటీర్‌గా పనిచేసేవారు. అతని ఇంటి దగ్గర సిమెంట్ రోడ్డును నాలుగేళ్ల క్రితం నిర్మించారు. తన స్థలంలో సైతం నిర్మించారని, దీంతో ఉమ్మడి ఆస్తి పంపకాల్లో తమ బంధువుల మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. నష్టపరిహారాన్ని సైతం ఇవ్వలేదని ఆరోపించారు. అధికారుల చుట్టూ పలు మార్లు తిరిగినా ప్రయోజనం లభించలేదని, ఈ కారణంగానే సిమెంట్ రోడ్డు నిర్మించిన ప్రాంతంలో గోడను ఏర్పాటు చేశానని వివరించారు. మరోవైపు దారి మూసేయడమేమిటంటూ పలువురు గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న కమిషనర్ గంగా ప్రసాద్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని గోడను తొలగించారు.

రేషన్ బియ్యం కోటాకు కోత

- చౌక దుకాణాలకు పూర్తి స్థాయిలో జరగని సరఫరా
- కార్డుదారుల ఇబ్బందులు

➡ అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు శాంతమ్మ బియ్యం కోసం నాలుగుసార్లు ఎండీయూ వాహనం, ఆ ప్రాంత చౌక దుకాణం చుట్టూ తిరిగారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

➡ కోవూరుకు చెందిన మస్తాన్ అనే వ్యక్తి బియ్యం కోసం వారం రోజులుగా తిరుగుతున్నారు. ఇంత వరకు అందలేదు.

➡ నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళేనికి చెందిన వ్యవసాయ కార్మికుడు శ్రీనివాసరావు రేషన్ కోసం చౌక దుకాణం చుట్టూ తిరుగుతున్నారు.

నెల్లూరు(పొగతోట): జిల్లాలో రేషన్ బియ్యం సరఫరాలో సమస్యలు నెలకొన్నాయి. చౌకదుకాణాలకు సరఫరా చేయాల్సిన దానికన్నా తక్కువ స్థాయిలో రేషన్‌ను అందించారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి దుకాణానికి పది నుంచి 20 శాతం కోత విధించారని సమాచారం. ఈ క్రమంలో 20 శాతం మంది కార్డుదారులకు బియ్యం అందక ఎండీయూ వాహనాలు, చౌక దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు.

ఆ విధానానికి స్వస్తి

జిల్లాలో 7.23 లక్షల రేషన్ కార్డులున్నాయి. ప్రతి నెలా 1,513 చౌక దుకాణాల ద్వారా 13 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. చౌక దుకాణంలో మిగిలిన బియ్యం ఆధారంగా మరుసటి నెల్లో కేటాయింపులుంటాయి. అయితే రెండు నెలల నుంచి బ్యాక్ లాగ్ ఆధారంగా రేషన్ సరఫరా విధానానికి అధికారులు స్వస్తి పలికారు. ఇష్టానుసారంగా కోత విధించారు. దీంతో కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. అందుబాటులో ఉన్న బియ్యాన్నే పంపిణీ చేశారు. ప్రస్తుతం 20 శాతం మందికి బియ్యం అందలేదని తెలుస్తోంది. బియ్యాన్ని తక్కువగా సరఫరా చేశారని డీలర్లు చెప్పడంతో ఆయా ప్రాంతాల సీఎస్డీటీలు ప్రతి దుకాణానికి మరో పది శాతాన్ని మంజూరు చేయాలంటూ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించుకున్నారు. కాగా దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇంతవరకు జారీ కాలేదు.

డీలర్లు ఏమంటున్నారంటే..

జిల్లాలో రేషన్ కొరత ఉన్నా, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారులను సంప్రదిస్తే మా చేతుల్లో ఏమీ లేదంటూ చేతులెత్తేశారని డీలర్లు చెప్తున్నారు. కార్డుదారులు తమ చుట్టూ తిరుగుతున్నారని, వారికి సమాధానం చెప్పలేకపోతున్నామని డీలర్ల అసోసియేషన్ నేతలు వెల్లడిస్తున్నారు.

మాకు సంబంధం లేదు

రెండు నెలల నుంచి రేషన్‌లో కోత విధించారని డీలర్లు చెప్తున్నారు. అలాట్‌మెంట్ విషయం రాష్ట్ర స్థాయి అధికారుల చేతుల్లో ఉంటుంది. జిల్లా పౌర సరఫరాల శాఖకు సంబంధం లేదు. రేషన్ అలాట్‌మెంట్ తర్వాత కార్డుదారులకు పంపిణీ విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. మిగిలిన కార్డుదారులకు రేషన్ అందించేలా చర్యలు చేపడతాం.

– అంకయ్య, డీఎస్‌ఓ